

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 18 అక్టోబర్, 2021 సంచిక : 5

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ ఎం. సత్యనారాయణ M.Tech.
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

| విషయసూచిక | పుట సంఖ్య |
|---|---|
| మా వాణి | 2 |
| భక్త గోమాబాయి | 6 |
| సాయి సేవక్-శ్రీ శివనేశన్ | 9 |
| శాశ్వత ధర్మగోప్త | 13 |
| శ్రీ సాయి నిత్య పారాయణ | 16 |
| సాయిభక్త దాసగణు | 18 |
| పునరపి జననం | 21 |
| మాతృసంస్థ కబుర్లు | 26 |
| విన్నపము | 29 |
| ఆశ్రమభిక్ష | 30 |
| ధర్మాచరణకు వయస్సు | 31 |

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



## సింహవాహిని సాయిదుర్గ

విజయదశమి అనగానే దుష్టసంహారం, శిష్టావనం గుర్తు వస్తాయి. శ్రీరామ విజయం యీనాడే సంభవించింది. అర్జునుడు శమీవృక్షం పై నున్న తమ ఆయుధాలు తీసుకొని శత్రుమదాన్ని అణచిన రోజూ అదే. మహిషాసురుని దుశ్చేష్టలకు కినిసిన ఆదిశక్తి దుర్గాదేవిగా అవతరించి వాడిని సంహరించిందీ యీనాడే.

మహా తపశ్శాలి, పరమ మాతృ భక్తిపరుడు, గొప్ప విద్వాంసుడూ, మహావీరుడూ అయినప్పటికీ దశకంఠుడు పరస్త్రీ వ్యామోహంతో కామానికి లోబడి, మదానికి లొంగిపోయి తన వినాశనాన్ని తానే కోరి తెచ్చుకున్నాడు. శ్రీరాముడు తన యిల్లాలిని కాపాడుకోవటం అనే సాకుతో ధర్మరక్షణార్థం యుద్ధం చేసాడు. చివరకు దుష్ట సంహారం జరిగింది.

దుర్యోధనుడు గొప్ప యోధుడు. మంచి పరిపాలకుడనీ, అతని ప్రజారంజకత్వం ఎంత గొప్పదంటే-అతని రాజ్యంలో తిరుగుబాటు అన్నది లేనే లేదనీ స్వయంగా వ్యాసభగవానులే అన్నారు. మిత్ర వాత్సల్యాది విశిష్ట గుణాలూ ఆయనకు ఉన్నాయి. అయినప్పటికీ మాత్సర్యం అన్న శత్రువు చేత చిక్కి, క్రోధానికి వశుడై అధర్మానికి ఒడిగట్టాడు. అదే అతని వినాశనానికి కారణమైంది.

మహిషాసురుడు అహంభావి. బలగర్వంతో ఒళ్లెరుగకుండా ప్రవర్తించాడు. మోహావిష్టుడై తరతమాలెరుగక సాక్షాత్తు దుర్గాదేవి పైనే కత్తి గట్టాడు. వరప్రసాదితుడైన అంతటి వీరుడూ మట్టిగొట్టుకుపోయాడు.

అంచేత దసరా ఉత్సవాలు దుష్ట సంహారానికి చిహ్నాలు. తెలుగునాట-దక్షిణాది మొత్తంలోనూ కూడా శమీపూజ, పారువేట ఆనాటి ప్రధానమైన ఉత్సవాలు.

**"శమీ శమయతే పాపం - శమీ శత్రు వినాశినీ।**

**అర్జునస్య ధనుర్ధారీ - రామస్య ప్రియదర్శినీ ॥"**

- అంటూ జమ్మిచెట్టుకు ప్రదక్షిణ చేసి, పూజించి, ఆ జమ్మి ఆకును కొద్దిగా త్రుంచి తెచ్చుకోవటం ఆచారంగా వస్తోంది. ఈ శమీపూజ ఎవరికి వారుగా వెళ్లటం గాక- బంధుమిత్రులందరూ-చిన్న చిన్న ఊళ్లలోనైతే ఊరి వారందరూ కలసి ఒక్కటిగా వెళ్లటం సంప్రదాయం. దీనివలన ఏదైనా ఒక మహత్కార్యాన్ని సాధించాలంటే-ఒక పీడను అరికట్టాలంటే - సమాజం అంతా ఒక్కటై నిలచి నడుం కట్టాలన్న విషయం సూచింపబడుతున్నది. పారువేట కూడా యిలాంటిదే. 'పాలపిట్ట'లు ఊళ్లలో ఉండవు. ఊరి బయట చేలల్లో ఉంటాయి సాధారణంగా. అంచేత ఆనాడు పాలపిట్టను చూచి తీరాలనేది కొన్ని ప్రాంతాలలో నియమంగా పెట్టుకోవటం, దాన్ని ఊరి వెలుపలికి అందరూ ఐక్యంగా వెళ్లటం ఒక ఉత్సవంగా ఏర్పరచుకున్నారు. ఇదే "సీమోల్లంఘనం".

ఉత్తర భారతంలో - ముఖ్యంగా వంగ రాష్ట్రంలో దసరా తొమ్మిది రోజులూ దేవీ నవరాత్రులు నిర్వహిస్తారు. పేదలు-ధనికులు, పెద్దలు-పిన్నలు అన్న భేదం లేకుండా అందరూ మహోత్సాహంతో సింహవాహన అయిన దేవిని కొలుస్తూ యీ ఉత్సవాల్లో పాల్గొంటారు. సాయీ భక్తులకు విజయ దశమి ఒక విశిష్టదినం. అది స్వామి సమాధి చెందిన రోజు. అంతకు కొన్నేళ్లకు ముందే తాను దసరానాడే సమాధి చెందుతున్నానని ఆయన సూచించారు కూడా.





ఎన్నడో ఎక్కడో జరిగిన శుభాలకూ, ధర్మ స్థాపనకూ చిహ్నంగా యీనాడు మనం విజయదశమి జరుపుకుంటున్నాం-బాగుంది. అయితే నేడు నేల నాలుగు చెరగులా ధర్మం నెలకొన్నదా? మహిషాసురుడి లాంటి క్రూరులు, నీచులు అందరూ అంతరించిపోయారా? లేదే! అనేక రూపాలలో తిరిగి తిరిగి అవతరిస్తూనే ఉన్నారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులతో అత్యంత నిర్దాక్షిణ్యంగా బేరాలు చేసే డాక్టర్లూ, తన మీద అనంత విశ్వాసంతో చెంత జేరిన విద్యార్థులను నిర్లక్ష్యం చేసి, ట్యూషన్లకే తమ విజ్ఞానాన్ని అమ్ముకొనే టీచర్లూ, అపరిమితమైన లాభాల కోసం ప్రతి వస్తువులోనూ, చివరికి మందుల్లోనూ, పసికందులు త్రాగే పాల డబ్బాల్లోనూ సైతం కల్తీలు కలిపే వ్యాపారులు, తమ మీద అమిత విశ్వాసంతో ఓట్లిచ్చి పీఠాలెక్కించిన ప్రజల నెత్తిన టోపీలు బెట్టిన నాయకమ్మన్యులూ, కట్నం డబ్బుల కోసం పెళ్లాలపై కిరసనాయిలు పోసి తగులబెట్టే మొగుళ్లూ, తమ ఆనందం తాము వెదుక్కుంటూ, తాము కన్న సంతానానికి సరైన, ప్రేమ, శిక్షణ అందించక దేశ సంస్కృతీ ధర్మాలను గూర్చి చెప్పకుండా నిర్లక్ష్యంగా వదిలేసి దుష్ట పౌరులను లోకానికి అందిస్తున్న తల్లులూ-వీళ్లందరూ మహిషాసురులు కారూ! ఆడామగా, పిల్లాపెద్దా అందరూ చదివే దిన, వార పత్రికలను కూడా బూతు పత్రికలుగా మారుస్తున్న కొందరు పబ్లిషర్లూ ముష్టి డబ్బు కోసం, పాప్యులారిటీ కోసం అతి చౌకబారు రచనలు సాగించే దౌర్భాగ్యపు రచయితలూ, ఆడదాని అంగంగాలను నగ్నంగా ప్రదర్శించటమే కళ అన్నట్లు సినిమాలు తీసే ప్రొడ్యూసర్లూ, తమ పిల్లలూ చూస్తారన్న సత్యం మరిచి ఆ దృశ్యాలను ఆమోదించి నటించే తార(డు)లూ-వీళ్లంతా మహిషులు కారూ! ఇంకా ఎన్నెన్నో రకాల రాక్షసులు!

ఎప్పుడూ నిజం నిష్ఠూరంగానే ఉంటుంది. కానీ, అలా అని చెప్పకుండా ఊరుకుంటే అది సమాజ ద్రోహమూ, దేశ ద్రోహమూ మాత్రమే గాదు- ఆత్మ ద్రోహం కూడా అవుతుంది.

**"కర్తాకారయితా చైవ ప్రేరకశ్చాను మోదకశ్చః।**

**సుకృతం దుష్కృతం చైవ చత్వారో సమ భాగినః॥"**

అన్న ఆర్యోక్తి మరచి, ధర్మానికి పతనం కలుగుతోంటే తన చుట్టూ దీనులు, దుఃఖితులూ దిక్కుతోచక అల్లాడుతోంటే చూస్తూ కూడా నిశ్చింతగా బ్రతుకుతున్న వేదాంతులూ, శాస్త్రవేత్తలూ, పీఠాధిపతులూ, మహా విద్వాంసులూ కూడా మహిషాసురుల సంతతేననటం నిర్ద్వంద్వం.

అయితే మన కర్తవ్యం ఏమిటి?

అరిషడ్వర్గపు గుప్పిట్లో చిక్కి మరణించిన రావణ, దుర్యోధన, మహిషాసురాదుల నుంచీ మనం ఒక పాఠం నేర్చుకోగలగాలి. ఎంత సాధన చేసినా, ఎన్ని గ్రంథాలు చదివినా-యీ అంతః శత్రువులను అణచనిదే మనకు గమ్యం చేరువ కాదు గాక కాదు. అందుచేత నిరంతరం మన లోలోపలి రాక్షసులను అణచే ప్రయత్నం సాగాలి. ఆపైన మన చుట్టూ ఉన్న రాక్షసుల పనిబట్టే ప్రయత్నం చేయాలి. మన గురు పరంపర దుష్ట సంహారం కోసం కాక దుష్టత్వ సంహారం కోసం అవతరించింది. అందుచేత మనం యీ నవీన రాక్షసులలోని అసురీ గుణాలపై తిరుగుబాటు చేయాలి. సింహవాహిని అయిన సాయిదుర్గలోని శక్తిని మనలోకి ఆవాహన చేసుకొందాం. ఆపైన అధర్మంపై నిరంతర పోరాటం సాగిద్దాం. ఆమేరకు శపథం చేసుకుందాం. అందులో మనం ఏ కొంచెం విజయం సాధించగలిగినా అదే మనకు విజయదశమి. ఆ పండుగ రోజు కోసం సాయిని పదే పదే ప్రార్థిద్దాం.





భక్త కథాసుధ

# భక్త గోమాబాయి

– ప్రభుజీ

మనిషై పుట్టిన తరువాత సాధించాల్సిన శ్రేష్ఠవస్తువు ఒకటుంది. అదే సచ్చిదానందం. మన జీవితంలో ప్రతి క్షణమూ అటువైపుగా అడుగులు వేయటానికే వినియోగించాలి. మనస్సు లౌకిక వస్తువుల మీద తగులుకొని ఉన్నంతసేపూ మన ప్రయాణం ఆలస్యమౌతూనే ఉంటుంది.

కర్తవ్యాన్ని అనుసరించి గృహస్థ జీవితం గడుపుతూ ఉన్నా తామరాకు మీది నీటిబొట్టు మాదిరిగా అంటీఅంటకుండా జీవించాలనీ, లోక కళ్యాణం కోసం కుల వృత్తుల ద్వారా ధర్మమార్గంలో అర్జించి బ్రహ్మచారులకు, సాధూ సన్యాసులకు ఆదరస్థానంగా ఉండాలనీ, పౌత్రుడు పుట్టగానే పూర్తిగా బంధాలన్నీ వదిలించుకొని అడవులకు వెళ్లి వానప్రస్థాశ్రమం స్వీకరించి మోక్షమార్గంలో వేగంగా పయనించాలనీ మన శాస్త్రాలు చెప్తాయి.

గృహస్థు తనకు తగుల్కున్న బంధాల కారణంగా సంసారంలో ఉన్నా, తన మనస్సులో మాత్రం సంసారం ఉండకూడదు. అవకాశం దొరికిన తక్షణం బంధనాల్ని వదిలించుకోవాలి.

భగవత్కృప వల్ల కొందరికి బంధనాలు వాటంతటవే వదిలిపోతై. దానికి సంతోషించి దైవధ్యానానికి ఆ కాలమంతా వినియోగించాలి. సంతానం కలగకపోతే స్వార్థపరంగా ఆలోచించవలసిన అవసరం లేకపోవటం వల్ల లోకకళ్యాణం కోసం తమ సమయాన్ని వినియోగిస్తూ నిష్కామ కర్మ యోగం సాధించవచ్చు. కాని దురదృష్టమేమిటంటే ఆశ్రమ ధర్మాన్ని పూర్తిగా మరచిపోయిన నేటి కాలంలో ఎవరు కన్న పిల్లవాడినో దత్తత అనే పేరుతో నెత్తికెక్కించుకొని వాడికి వీళ్ల పట్ల ప్రేమాభిమానాలు లేకపోవటం వలన జీవితమంతా కష్టాలు కొనితెచ్చుకుంటున్నారు కొందరు.

ఇది నాది, వీడు నా వాడు అనే భావనే మమకారం. ఆత్మోన్నత్య సాధనలో ఈ మమకారం ప్రథమ శత్రువు. ఈ మమకారరహితమైన ప్రేమభావనతో సమాజ పరమేశ్వరునికి చేసే సేవే మనకు పరమాత్ముడు చూపించిన సత్యమార్గం.

**"కహత సునుత జగతాహై- విషయ న మార్ఘొయికాల్**

**కహై కబీర సున్య ప్రాణి యా - సాహిబ నామ సంహాల్॥ - భక్త కబీరు**

లోక విషయాలెన్నో పలికావు విన్నావు కాలంబు గడిచెన మనసా ।

ఇకనైన దేవుని కీర్తించి భజయించి ఆనందమొందవో మనసా ॥

ఈ సూక్తిని ఆచరణలో పెట్టి పండరీనాథుని పాదపద్మాలను చేరుకున్న భక్తాగ్రగణ్య గోమాబాయి.

లక్షలాది మంది భక్తులకు స్ఫూర్తిదాత, మోక్షదాతయై వెలసిన ఆ పాండురంగ విఠలుని పండరీపురానికి కొద్దిదూరంలోనే ఒక పల్లెటూరు. ఆ కుగ్రామంలో నివసిస్తున్న ఒక బ్రాహ్మణ వితంతువు పేరే గోమాబాయి. చిన్నతనంలోనే వివాహం కావటం, సంతానం కలగకుండానే భర్త గతించటం - భగవంతుడీ విధంగా బంధనాలను రద్దు చేశాడు. ఒక చిన్న పూరిల్లు తప్ప వేరే సంపద ఏమీ లేదు. ఆ కారణాన బంధువర్గమూ దూరమైనారు. ఇతర లౌకికుల మాదిరిగా తానై కొత్త బంధనాలను కొని తెచ్చుకోలేదు. భగవంతుడేది ప్రసాదించినా అదంతా మన మంచికేనన్న భావంతో ఇక ఆ పరమాత్ముడే తోడుగా జీవిస్తుండేది. నిరంతరం భక్త వత్సలుడైన ఆ పాండురంగని స్మరణం, కీర్తనం చేస్తూ ఆనాటికేది ప్రాప్తిస్తే దాంతోనే తృప్తిపడుతూ, ఏదీ దొరకని రోజున పస్తులు ఉంటూ నిర్లిప్తంగా కాలం గడుపుతూంది.

గోమాబాయి మధ్యాహ్నం నుండి సాయంత్రం దాకా భగవత్కథా కాలక్షేపం చేస్తూ వుండేది. ఆ ఊళ్ళో వాళ్ళు ఈమె భక్తి తత్పరతను గమనించి ఎక్కువ సంఖ్యలో ఆ కథా కాలక్షేపానికి వస్తుండేవారు.





అందునా స్త్రీల సంఖ్య ఎక్కువ. ఆ వచ్చేటప్పుడు పత్రమో, పుష్పమో, ఫలమో తెస్తుండేవారు.

వారిలో కొందరు సూక్ష్మగ్రాహులు. ఆ భక్తురాలు తిన్న రోజుల కంటె పస్తున్న రోజులే ఎక్కువగా ఉన్నట్లు గ్రహించారు.

"ఈమె దయ వల్ల మనం పరమాత్ముని గుణగానం వినగలుగు తున్నాము. మన జీవితాలకు సార్థకత పొందగలుగుతున్నాము. దానికి మనం కృతజ్ఞతతో ఆమె బాగోగులు చూడకపోతే పాపం చుట్టుకుంటుంది. ఈ భక్తురాలు ప్రతిరోజూ తగినంత ఆహారం తీసుకునేటట్లు చూడాలి" అని తర్కించుకున్నారు. రోజుకొకరు చొప్పన భోజన సదుపాయం చెయ్యాలని కొందరూ, స్థిరమైన ఆదాయం కల్పించాలని కొందరూ, రకరకాలుగా సూచించారు. అంతలో ఒక ఉదారురాలైన వనిత లేచి "ఒక బాలగోపాల విగ్రహాన్ని గోమాబాయి యింట్లోనే ప్రతిష్ఠించి దానికి నిత్యం పూజాదికాలకూ, నివేదనకూ అయ్యే ఖర్చు తాను భరిస్తా"నని మాట ఇచ్చింది.

ఆ భక్తురాలు తాను మాట యిచ్చినట్లుగానే గోమాబాయి ఇంటి లోనే బాలగోపాలుని ప్రతిష్ఠింపజేసింది. నిత్యనైవేద్యాలకు ఏర్పాటు చేసింది. ఇటువంటి పుణ్యకార్యాల ఫలితమే గదా మనవెంట వచ్చేది. మాట యిచ్చే ముందు జాగ్రత్తగా ఆలోచించి మాట యివ్వాలి - ఒకసారి మాట యిచ్చిన తరువాత మాత్రం జాగు చేయక ఆ పనిని నెరవేర్చాలి - అని ధర్మశాస్త్రాలు చెప్తున్నాయి.

బాలగోపాలుడు తన యింటికి వేంచేసినందుకు గోమాబాయి ఎంతో మురిసిపోయింది. ఆ గోపాలబాలునికి తగిన సేవలు చేయగలనో లేనో అని ఎంతో అణకువతో క్షణక్షణమూ మెలకువతో ఉండేది. తానే యశోదగా మారి పుత్రవాత్సల్యంతో సేవించేది. భక్తి తన్మయత్వంలో తనను తాను మరచేది. ఎవ్వరూ లేనప్పుడు ఆ దేవునితో ఏమోమో మాట్లాడేది. ఆమెకు అదొక విగ్రహం కాదు - సజీవ రూపమే. **(సశేషం)**

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

తనకింత మేలు చేసిన బాబాకు కృతజ్ఞతా పూర్వకముగా 'ధుని పూజ' చేసెను స్వామీజీ.

బాబా భక్తుడైన నానా చందోర్కర్ కుమార్తె మైనతాయికి ఊదిని సేవింపజేసిన వెంటనే సుఖప్రసవమైన సంగతి మనందరికీ విదితమే. గర్భిణీ స్త్రీలు ఊది, తేనె 1 : 3 నిష్పత్తిలో సేవిస్తే సుఖ ప్రసవమవుతుందని స్వామీజీ తెలియజేసారు.

శ్రీ టి.యస్.యస్. ప్రసాద్ గారి (ఇంటి నెం. 111, సెక్టార్-2, వనస్థలి పురం, హైదరాబాద్-500 070) భార్య మధుమేహ వ్యాధితో బాధపడు తుండేవారు. ఒకసారి ఈమెకు కాలిలో మేకుగ్రుచ్చుకొని గాయమై నడవ లేని పరిస్థితిలో వైద్యులను సంప్రదించగా వారు శస్త్రచికిత్స చేయాలని చెప్పారు. ప్రసాద్‌గారు సాయి అంకిత భక్తులు, సాయి సచ్చరితను ఆరు వందల పర్యాయాలు పైగా పారాయణ చేసిన పరమ సాయి భక్తులు. నేటికిని ప్రతినిత్యం పారాయణ పూర్తి చేసిన పిమ్మటనే భుజింతురు. బాబా యందు అత్యంత విశ్వాసము గలవారు. ఆయన భార్యకు వైద్యులు శస్త్రచికిత్స చేయక తప్పదని వేరే మార్గం లేదని చెప్పినను బాబా పైనే భారంవేసి ఆమె గాయానికి రోజు ఊదిని రాసి, ప్రతినిత్యం బాబా తీర్థం ఇవ్వగా మూడవ రోజు నుంచే ఆమె నడవ గలిగింది. వారం రోజుల్లోనే గాయం పూర్తిగా మాని ఆరోగ్యవంతురాలయ్యెను. రెండవ పర్యాయం ఆమెను పరీక్షించిన వైద్యులు సహితం అచ్చెరువొంది, గాయం పూర్తిగా మానినదని ఏ విధమైన శస్త్రచికిత్స అవసరం లేదని చెప్పినారు.

స్వామీజీకి ధునియందు అత్యంత విశ్వాసము గలదు. ఆయన





విశ్వాసము మాటలలో వర్ణింప నలవికాదు.

1974వ సంవత్సరంలో రష్యా దేశమునకు చెందిన కొందరు వాతావరణ శాస్త్రవేత్తలు షిరిడీకి వచ్చి ధుని నుండి వెలువడు చుండిన పొగను గాంచి నిర్ఘాంతపోయిరి. ధుని నుండి వెలువడే కాలుష్యము ప్రజల ఆరోగ్యమునకు హానికరమని అభిప్రాయపడగా  స్వామీజీ వారితో "ఇది బాబా స్వహస్తములతో ప్రజ్వలింపబడిన ధుని. ఇందుండి ఏ విధమైన కాలుష్యము వెలువడదు, ప్రజలకు ఏ విధమైన హాని కలుగ చేయదు" అని ఘంటాపథంగా చెప్పినను వారు విశ్వసించక అనేక పరికరములతో పరీక్షించగా వారికి ఏ విధమైన కాలుష్యము కానరాలేదు. అయినను వారు తమ సందేహమును వీడక ధునికి సమర్పించు వస్తువులను వారి పరిశోధనాలయమందు మండించి అందుండి వెలువడిన పొగను పరీక్షించగా అందు వారికి విపరీతమైన కాలుష్యము కానవచ్చెను. ఇదంతయు ధుని మాత మహాత్మ్యమని గ్రహించి స్వామీజీ చెంతకు వచ్చి క్షమాపణ వేడుకొనిరి.

నా (ఈ గ్రంథ సంకలన కర్త) యొక్క స్వీయానుభవము ఊదీ, ధునిమాత మరియు సాయినాథుడు స్వామికి ఎటువంటి శక్తులిచ్చినది. చదువరులకు అవగతమవుతుందన్న సదుద్దేశ్యంతో మీ కందిస్తున్నాను.

అది 1994 జూలై 18వ తేదీ రాత్రి భోజనము ముగించుకుని నిద్ర కుపక్రమించినది. నా శ్రీమతి జయ భారత లక్ష్మీ టి.వి. వీక్షించుచున్నది. అప్పుడు సమయం షుమారు 10 గంటలైనది. ఉన్నట్లుండి నాకు గుండెలో విపరీతమైన నొప్పి వచ్చి కొద్ది క్షణములలోనే భరించలేనంతగా మారెను. ఆ సమయంలో డాక్టరు దగ్గరకు వెళ్ళు సౌకర్యము లేక నా శ్రీమతిని ఊది ఇవ్వమనగా ఆమె ఇచ్చిన ఊది నుదుట ధరించి మరికొంత సేవించగా కొద్ది క్షణములలోనే బాధ ఉపసమించి గాఢ నిద్ర ఆవహించినది. తెల్లవారు ఘామున షుమారు 4 గం. ప్రాంతంలో స్వప్నంలో

నేను ద్వారకామాయి చెంతనుండ స్వామీజీ నా ప్రక్కనే నిలబడి నారికేళము మరికొన్ని వస్తువులను నా చేతిలో ఉంచి "ధునికి గ్రిల్సు ఉన్నవి. వీటిని ధునిలో వేయుట ఎట్లు సాధ్యమ"ని ప్రశ్నించగా స్వామీజీ "నీవు చేతిని లోపలికి పెట్టు ఈ గ్రిల్సు నీకు అడ్డము రావు" అనగా నేను నా హస్తమును లోనికి పెట్టి చేతిలోని వస్తువులను ధునికి సమర్పించి ప్రక్కకు చూడగా స్వామీజీ చిరునవ్వులు చిందించుచుండెను. అంతలోనే నేను నిద్ర మేల్కాంచగా స్వప్నమంతయు జ్ఞప్తికి వచ్చెను. అరచేతులు రెండు విపరీతమైన వేడిగా నుండెను. నాకు వచ్చినది స్వప్నమా లేక నిజముగా జరిగినదో నాకు అవగతము కాలేదు. గుండె నొప్పి పూర్తిగా మటుమాయమయ్యెను. శరీరమంతయు ఎంతో తేలికాయెను. తెల్లవారిన తరువాత యధావిధిగా ఆఫీసుకు కూడ వెళ్ళినాను. మూడు నాల్గు రోజులు గడచిన పిదప నాకు వైద్యము చేయుచున్న డా॥ మల్లేశం గారి వద్దకు వెళ్ళి ఇ.సి.జి. తీయమనగా ఆయన మూడు పర్యాయములు ఇ.సి.జి. తీసి మిషను సరిగా పనిచేయుట లేదు మరునాడు రమ్మనగా నేను జరిగినదంతయు ఆయనకు వివరించగా "నీకు స్ట్రోకు వచ్చినది. ఇంత స్ట్రోకు వచ్చి బ్రతికిన వారిని నేనింత వరకు చూడలేదు. బాబానే నిన్ను రక్షించినాడు" ఇకమీదట జాగ్రత్తగా ఉండమని సలహానిచ్చెను. నాకు ప్రాణదాతలైన సాయినాథునికి, మన పూజ్య స్వామీజీకి ఏమిచ్చి నా రుణము తీర్చుకొనగలను. అందుకే వారికి అనంత కోటి ప్రణామాలు. వారి రుణము జన్మ జన్మలకు తీర్చుకొనలేను.

ఇంతటి మహిమాన్వితమైన ధుని మాతకు మన స్వామీజీ ప్రతి నిత్యము ఉదయం నారికేళములు, నవధాన్యములు మొ॥నవి, మధ్యాహ్న సమయమున ధుని పూజ సాయంకాల సమయమున మరల నారికేళములు సమర్పించెడి వారు. బాధా నివారణ కొరకు తన చెంతకు వచ్చిన భక్తులకు ధుని పూజ చేయమని చెప్పెడివారు. సాయినాథుడు





సహితము ప్రతి నిత్యము ఉదయముననే ఈ ధుని చెంత ఆశీనుడై "అల్లా మాలిక్, అల్లా మాలిక్" యని మెల్లగా ఉచ్చరించెడి వారు. బాబా చేతనే పూజలందుకొని ధన్యత చెందినదీ ధుని మాత. అందువల్లనే ఈ ధునికి అనన్యశక్తులు లభించినవి.

**సమస్యలకు సమాధానమిచ్చే సమాధి :**

"నా సమాధి మాట్లాడుతుంది, అది మీ కోర్కెలను తీరుస్తుంది" అని బాబా తన భక్తులకు అభయమొసంగెను. నేటికిని బాబా మహా సమాధి వద్ద అనేకమంది భక్తులు వివిధ రకములైన అనుభూతులు పొందు తున్నారు. వాటిలో కొన్నిటిని మన పూజ్య స్వామీజీ వివరించగా వాటిని మీ కందిస్తున్నాను.

బాబా సమాధి చెందిన తరువాత బొంబాయి నివాసి యగు శ్రీమతి రుస్తుంజీ షిరిడీ వచ్చి బాబా మహా సమాధి పై తన శిరము నుంచి "బాబా నీవు జీవించి ఉన్న రోజులలో నా కష్టాలను కడతేర్చి నన్ను రక్షించినావు, ఇప్పుడు నాకు దిక్కెవరు?" యని రోదిస్తుండగా ఆమెకు సమాధి నుండి "రుస్తుం బేటా కబ్ ఆయా?" అన్న మాటలు ముమ్మారు వినిపించినవి. ఆ మాటలు విన్న ఆమె బాబా సమాధి నుండియే సర్వ కార్యములు నిర్వహించుచున్నాడని గ్రహించి ఎల్లప్పుడూ బాబా తనను రక్షించునన్న దృఢ విశ్వాసంతో బొంబాయి చేరుకుంది.

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ పట్టణమునకు చెందిన ఒక భక్తుడు షిరిడీ వెళ్ళి బాబా సమాధి చెంత "బాబా, నీ సమాధి మాట్లాడుతుందన్న నీ అభయం నిజమైతే ఈ క్షణాన్నే నాకేదైనా నిదర్శనం చూపించు" అనగా పై నుంచి చిన్న రాయి ఒకటి అతని ముందు పడింది. దానిని తీసి పరికించి చూడగా దాని మీద బాబా బండ మీద ఆశీనుడై ఆశీర్వదిస్తున్న చిత్రం అతి సుందరంగా చిత్రించబడియున్నది. దీనిని గాంచిన ఆ భక్తుడి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

**(సశేషం)**

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

తన తండ్రిని శతధ్వనుడు చంపి, శ్యమంతకాన్ని బలవంతాన అపహరించి తీసుకొనిపోయినాడని సత్యభామ, హస్తినాపురంలో ఉన్న శ్రీకృష్ణునికి వార్తను పంపింది.

ఆ వార్త తెలియడంతో శ్రీకృష్ణ, బలరాములు ద్వారకకు తిరిగి వచ్చారు.

శతధ్వనుడు చేసిన పనికి అతణ్ణి వెంటనే శిక్షించకపోతే, గణ సంఘంలో క్రమంగా చీలికలు వచ్చే ప్రమాదం ఉన్నదని శ్రీకృష్ణుడు నిశ్చయించుకున్నాడు. ద్వారకకు రాగానే ముందు తన స్వంత సైన్యంతో శతధ్వనునిపై దాడిచేశాడు. ఆ ఆకస్మికమైన దాడికి శతధ్వనుడు భయపడి అక్రూరుణ్ణి సహాయం కొరకు అర్థించాడు.

కానీ, శ్రీకృష్ణునితో తలపడడానికి అక్రూరునికి ధైర్యం చాలలేదు. చివరికి శతధ్వనుడు ఏకాకి అయినాడు. అక్రూరుని వంచనతో అతడు భయపడి ద్వారకను విడిచి పారిపోయినాడు. శ్రీకృష్ణుడు అతని వెంటబడి తరిమితరిమి చివరికి మిథిలానగర పరిసరాలలో పట్టుకొని సంహరించాడు. శతధన్వుని దగ్గర మణి లేదని శ్రీకృష్ణునికి తెలిసింది. సత్రాజిత్తు సౌధం నుంచి శతధన్వుడే మణిని అపహరించాడని సత్యభామ చెప్పింది. మరైతే ఎక్కడ ఉండాలి?

'వాసుదేవా! మీకు ఒక రహస్యం చెప్పాలి. మీరు హస్తినాపురంలో ఉండగా శతధ్వనుడు ఎన్నడూ లేనిది అక్రూరుల వారితో కలిసి తిరుగుతుండేవాడు. ఎక్కువకాలం అక్రూరుల వారి లోగిలిలోనే కనబడుతుండేవాడు. మరి మీ రాకతో ఆ ఇరువురు ఒక్కసారిగా ఒకరికొకరు దూరమైనారు'.





కృతవర్మ 'ఇతడు చెప్పింది నిజమే వాసుదేవా! అక్రూరులవారు మీరు రాగానే నీరసపడినట్లు కన్పించారు. మీరు వచ్చినప్పుడు అతనిలో సంతోషం కన్పించలేదు' అన్నాడు.

శ్రీకృష్ణుడు ఈ విషయాన్ని గురించి సూటిగా అక్రూరుల వారితోటి చర్చిద్దామనుకున్నాడు. శ్రీకృష్ణుడు అక్రూరుని సౌధానికి వెళ్ళాడు. కాని అక్రూరుడు అప్పుడు ఒక యజ్ఞాన్ని చేస్తున్నాడు. యజ్ఞదీక్షితునితో వివాదం పనికిరాదు. అది శాస్త్రవిరుద్ధం.

యజ్ఞశాలలో పురోహితుల మంత్రఘోష నిరంతరం విన్పిస్తుండేది. నిరంతరం అన్నదానం కూడా సాగుతుండేది. ఒక యజ్ఞం తర్వాత మరో యజ్ఞం అలా సాగుతూనే ఉన్నది. కృష్ణ బలరాములకు ఆశ్చర్యం కలిగింది. సాత్యకికి అనుమానమే ఏర్పడింది.

'పాలు త్రాగుతూ పిల్లి కనులు మూసుకుంటుంది. ఈ యజ్ఞాల నెపాన అక్రూరుల వారు తన గుట్టురట్టు కాకుండా కాపాడుకుంటున్నారు. నా అనుమానం శతధ్వనుడు మణిని అక్రూరుల వారి వద్ద దాచాడనే' అన్నాడు సాత్యకి.

'ఇప్పుడు జరుగుతున్న యజ్ఞం ఎల్లుండి మధ్యాహ్నం పూర్తవుతుంది. పూర్ణాహుతికి ఎలాగూ మనను పిలిచాడు కదా! పూర్ణాహుతి, మహదాశీర్వచనం కాగానే అక్కడే నిలదీద్దా'మన్నాడు బలరాముడు. కానీ, ఆ రాత్రే అనుకున్న దానికంటే మూడు ఘడియల ముందే పూర్ణాహుతి పూర్తయింది. అంతకుముందే అక్రూరుడు దీర్ఘప్రయాణానికి కావలసిన సమస్త పదార్థాలను సమాయత్తం చేసుకుని, శకటాలలో నగరానికి దూరంగా పంపించాడు.

శ్రీకృష్ణునికి ఇది చాలా బాధ కలిగించింది. అంతవరకు అక్రూరుడు చాలా విశ్వాసపాత్రుడుగా వృష్ణి కులశ్రేష్టుడుగా, వృష్ణి నాయకుడుగా సుధర్మలో జరిగే సమావేశాలలో అందరి గౌరవాదరాలను పొందుతూ

వచ్చినవాడు.

'అన్నా! అక్రూరుల వారి ప్రవర్తన అభ్యంతరకరం. ఇంతవరకు ఆయన సుధర్మలో ధర్మం పక్షాన నిల్చున్న నాయకుడు. ఇంత స్వార్థానికి తలపెడతాడని ఊహించలేదు' అని శ్రీకృష్ణుడన్నాడు.

'ఈ విషయం సుధర్మతో చర్చించవలసిందే. నాయన గారితో, ఉగ్రసేనుల వారితో, సత్యకులతో సంప్రదించందే ఏ చర్య తీసుకోరాదు' అన్నాడు బలరాముడు.

'తన పెద్దరికాన్ని ఇలా ఇంత దారుణానికి వాడుకోవడం, అక్రూరుని వంటి వారికి శోభనీయ'దని చికాకు కనబరచాడు సాత్యకి.

'అక్రూరుల వారు ఒక దాని తరువాత ఒకటిగా ఈ యజ్ఞాలు చేస్తూ, ఘోమధూమాల తెరచాటున తన తప్పను దాచుకుంటున్నారని నేనూహించాను. కానీ, యజ్ఞదీక్షితులతో వివాదం చేయరాదని ఊరకున్నాను' అన్నాడు శ్రీకృష్ణుడు.

ఆ రోజు సాయంత్రం ఉగ్రసేనుని భవనంలో వసుదేవుడు, సత్యకుడు, బలరాముడు, శ్రీకృష్ణుడు, సాత్యకి, కృతవర్మ, ప్రద్యోతుడు మరికొందరు కలుసుకున్నారు. ఈ విషయాన్ని గురించి సమగ్రంగా చర్చించారు.

వసుదేవుల వారు 'ఘర్షణకు దిగవద్ద'న్నారు. 'అక్రూరునికి అన్ని యాదవగణాలలో పలుకుబడి ఉన్నది. అతని వెంట అతిరథులెందరో ఉన్నారు. శ్యమంతకాన్ని ఆయన స్వయంగా దొంగిలించాడనడానికి సాక్ష్యం లేదు. అతనిని ఇంతవరకు ఆ విషయంలో ప్రశ్నించనూ లేదు'.

'అయితే మౌనంగా ఉండమంటారు' సాత్యకి ఉద్రేకపడ్డాడు. శ్రీకృష్ణ, బలరాములు, సత్యకుల వారి వైపు చూచారు.

'కృష్ణా! అక్రూరుడు నీ చేతి కందకుండా ఎంతకని పారిపోగలడు? ఎక్కడికని ఎంతకాలానికని పోగలడు. కేవలం భయం వల్ల తప్పించుకు తిరుగుతున్నాడు' అన్నాడు సత్యకుడు.

**(సశేషం)**





# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

## 2. సాయే మాధవుడిలలో

తే.గీ. పరుల సేవయె నిరతంబు పరమ మనుచు
శిరిడి గ్రామము నందున స్థిరము గాను
సేవ జేసెను ఆర్తుల సేదదీర
శిరిడి నాధుడు శ్రీ సాయి శివుడె యిలను. 1

తే.గీ. ఆదమరువక శిరిడీన ఆదరమున
నార్త జనులను బడనీక యాపదలను
సాయి! యనగనె వారిని చక్కదిద్ది
ఆదు కొనియెను సాయీశు డాప్త బంధు. 2

తే.గీ. కొంగు బంగార మీతడు కొలుచు వారి
కోర్కె దీర్చెడు దేవుఁడు కోరగానె
మంచి చెడులను తెలిపెడి మార్గదర్శి
సాయి నాధుడె మనకెల్ల సాయ మగును. 3

కం. ఓ! యని పిలచిన పలుకును,
కాయును కష్టములు దీర్చి, కరుణను జనులన్

బ్రోయును, సాయిని దలచిన
మాయును పాపములు, సాయి మాధవుడిలలో. 4

కం. కోరిన కోర్కెలు దీర్చును
భారము భరియించి సాయి భక్తుల గాచున్
పారగ ద్రోలును చెడుగును
పారము జేర్చును కడపట పతనము గాకన్. 5

కం. వెలసెను శిరిడిన బాలుడు
పలుకగ పదునారు వర్ష ప్రాయము వాడున్.
మలచెను జనముల భక్తిని
వలసెను కష్టములు తాను వసుధను సాయై. 6


సీ. రఘువంశ తిలకుడు రావణ హతకుడు
శ్రీరామ చంద్రుడు శ్రీపతియగు
ఖరదూష నాదుల ఖండించి యాతడు
భూమి భారము దీర్చె భువన భర్త
ద్వాపర యుగమున దైత్యుల నిర్జింప
కృష్ణుడై జన్మించె విష్ణుమూర్తి
సంహార కార్యము చక్కగా నెరవేర్చి
శాంతిని నెలకొల్పె శాంతిధూత

ఆ.వె. కలియుగమున తాను కరుణ గల్గిన సాయి
పుడమి నుద్ధరించ పూనుకొనియె
సాలె నేత వోలె సంస్కార కార్యంబు
సాయి బోధ వలన సాధ్య మయ్యె. 7

**(సశేషం)**







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిశోర్

**(గత సంచిక తరువాయి)**

ఆ విషయాలన్నింటినీ మనం కూలంకషంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. కానీ, దానికి ముందుగా, దాసగణుచే లౌకిక జీవనానికి నీళ్ళొది లించి, పూర్తిగా పారమార్థిక పథోన్ముఖుని చేసేందుకే ప్రాధాన్యమిచ్చిన అపూర్వమైన బాబా చర్యలను కొంచెంగా వివేచన చేద్దాం.

బాబా ఎన్నడూ ఏ భక్తుని కూడా తమ లౌకిక జీవితాన్ని వదులుకోమని చెప్పలేదు. ఆ దిశగా ప్రోత్సహించనూ లేదు. కొన్ని సందర్భాలలోనయితే ఆ భక్తులు అడగకుండానే, పట్టుబట్టి మరీ వారికి ప్రాపంచిక ప్రయోజనాన్ని చేకూర్చి పెట్టారు. ఉదాహరణకు లక్ష్మణ్ ముంగే అనే భక్తుడు, బాబా దర్శనానికి వచ్చి, తాను తన వివాహం కోసమై రహతాలో బంధువుల వద్ద బంగారం అరువు తీసుకోవడానికి వచ్చానని చెప్పాడు. అప్పుడు బాబా **"ఈ రోజులలో ఎవరికి ఎవరు. నీకు ఎంత బంగారం కావాలో నన్ను అడుగు, నేనిస్తాను"** అని చెప్పారు. బాబా నాకు బంగారం ఎక్కడ నుండి ఇస్తారు? అనే ఉద్దేశ్యంతో లక్ష్మణ్ ముంగే ఏమీ మాట్లాడకుండా మౌనంగా వెళ్ళిపోయాడు. తరువాత బాబా చెప్పినట్లుగానే బంధువులు బంగారాన్ని ఇవ్వడానికి తిరస్కరించారు. అప్పుడు బాబా దయ వలన ఒక మార్వాడీ కేవలం ఇరవై ఐదు రూపాయలకు రెండు వేల రూపాయల విలువ చేసే బంగారాన్ని పెళ్ళి కోసమై అరువుగా ఇస్తాడు. ఈ లీలలో గమనించవలసిన విషయం ఏమిటంటే, లక్ష్మణ్ ముంగే బాబాను బంగారం ప్రసాదించమని అడగలేదు. తాను బంగారం తీసుకోవడానికై బంధువుల వద్దకు వచ్చానని కేవలం సమాచారం మాత్రమే ఇచ్చాడు. బాబా తమకై తాము ఎంతో

వాత్సల్యంతో లక్ష్మణ్ ముంగేకు కావాల్సిన ప్రయోజనాన్ని ఒనకూర్చి పెట్టారు. అంతేకానీ, “బంగారం, నగలు, వివాహం అంతా మాయ. వాటి మోహంలో పడవద్దు” అని వేదాంతాన్ని బోధించలేదు. ఇంకొక ఉదాహరణ.

రఘువీర్ భాస్కర్ పురంధరే అనే భక్తునికి సొంత ఇల్లు కట్టుకోమని బాబా చెప్పారు. “లాభం లేదు బాబా, అంత డబ్బులు నా దగ్గర లేవు. అది నా వల్ల అయ్యే పని కాదు” అని తన నిస్సహాయతను వ్యక్తపరిస్తే **“నీకెందుకురా అంతా నేను చూసుకుంటాను”** అని బాబా తమ భరోసాను ప్రసాదించారు. కొద్దిరోజులకు పురంధరే స్నేహితుడు వచ్చి “నేను నా స్థలం అమ్మాలని నిర్ణయించుకున్నాను. కానీ, ఎందుకో ఆ స్థలాన్ని నీకే అమ్మాలని బుద్ధిపుడుతుంది. నీవు ఎంత ఇవ్వగలిగితే అంత ఇచ్చి ఆ స్థలాన్ని నువ్వే తీసేసుకో” అని చెప్పాడు. ఆ విధంగా పురంధరేకు అతి తక్కువ ధరకు స్థలం లభించింది. “స్థలమైతే కొన్నాను కానీ, ఇల్లు కట్టడం నా వల్ల కాదు” అని పురంధరే ఇల్లు కట్టే ప్రక్రియను వాయిదా వేస్తుంటే, బాబా పదేపదే ఆ విషయంపై తన మీద వత్తిడి చేసారు. ఎంతగా అంటే, **“ఇల్లు కట్టుకో మని మంచిగా చెపుతుంటే నీకు అర్థం కావడం లేదు. ఇక నా పద్ధతిలో చెప్పాల్సిందే”** అని తనతో ఒకసారి తీవ్ర కోపంతో అన్నారు. అంతే, ఆ క్షణం నుండి పురంధరేకు తీవ్రమైన తలనొప్పి ప్రారంభమైంది. అలా ప్రారంభమైన తలనొప్పి పురంధరే తన సొంతిట్లో గృహప్రవేశం చేసాక కానీ తగ్గలేదు. తమ జీవనపర్యంతం ఒక పాడుబడిన మసీదులో నివసించిన బాబా, తమ భక్తునికి సౌకర్యవంతమైన సొంత ఇల్లు ఏర్పరచడానికి పడిన తపన, చూపించిన వాత్సల్యం వంటివి చూస్తే **“నా భక్తుల ఐహిక, ఆముష్మిక బాధ్యత నాదే”** అనే బాబా మాటలలోని సత్యత, ఆయన భక్త సులభత మన హృదయాన్ని బలంగా స్పృశిస్తాయి.

తీవ్ర విరాగియై జీవితాన్ని తమ సన్నిధానంలో వెళ్ళబుచ్చుతున్న భక్త





మహల్సాపతికి **“అరే భగత్! నీవు ఇంటికి వెళ్ళి సంసారం చేయాలి. ఒక మగబిడ్డకు తండ్రి కావాలి”** అని తరచూ చెప్పేవారు. “వాటన్నింటి మీద నాకు ఆసక్తి లేదు బాబా” అని మహల్సాపతి తన అయిష్టతను వ్యక్తపరిస్తే, **“లేదురా భగత్! ఆడపిల్లలు చింతపండు వంటివారు, మగబిడ్డలు మామిడిపండు వంటివారు”** అని అర్థమొచ్చే ఒక మరాఠి సామెతను చెప్పి, సముదాయిస్తూ తనను ఇంటికి పంపేవారు. తరువాత సరిగ్గా సంవత్సరానికి మహల్సాపతి ఒక మగబిడ్డకు తండ్రయ్యాడు.

శిరిడీలో బాబాకు ఆరతి ఇవ్వడం ప్రారంభమైన రోజు నుండి, బాబాకు నిత్యనియమంగా, విధిపూర్వకంగా పూజ చేసి ఆరతినిచ్చే మేఘుడు అనే భక్తుడు మరణించినప్పుడు బిడ్డను పోగొట్టుకున్న కన్నతల్లి మాదిరి బాబా గుండెలు బాదుకుంటూ హృదయవిదారకంగా పెద్దపెట్టున రోదించారు. ఆ విధంగా రోదిస్తూ మేఘుని అంతిమయాత్రలో వీధిమలుపు వరకు తాము కూడా పాల్గొని, పార్థివ దేహాన్ని సాగనంపారు. బాబా రోదన చాలా దూరం వరకు వినిపించిందని శ్రీ ఖపర్డే తమ దైనందినిలో వ్రాసుకున్నారు. అంతేకాదు, తమ ఖర్చుతో మేఘుని శ్రాద్ధకర్మలు జరిపించి, తన పేరుతో అన్నదానం చేసారు. నిజానికి ఎన్నడూ మరణించని ఆత్మకు దేహం ఒక వస్త్రం మాత్రమే! అటువంటి అనుభవజ్ఞానం కలిగిన మహాత్ములకు మరణ మనేది వస్త్రాన్ని (దేహాన్ని) మార్చుకునేందుకు ఆత్మ తీసుకునే విరామం మాత్రమే! మరి, మేఘుని మరణం పట్ల బాబా అంతగా రోదించడంలో కారణం తెలుసుకునే ప్రయత్నం చేస్తే ఆ సద్గురునాథుని దివ్య చరణాల వద్ద అవిభక్త ఆశ్రయం పొందడానికి హృదయం తత్పరమవుతుంది. జన్మ జన్మలకు సాయిభక్తులుగా జన్మించాలనే కోరిక తీవ్రమవుతుంది. వివరాల లోకి వెళితే .. సాఠేవాడాలో సన్నిహితులైన సహచర భక్తులతో కూర్చొని మనసువిప్పి మాట్లాడే సమయంలో మేఘుడు తనకు “నా అనే వాళ్ళు” ఎవరు లేరని బాధపడేవాడు. **(సశేషం)**

# పునరపి జననం పునరపి మరణం

- జ్ఞానాదనంద

ఓ ఇంట్లో వేడుకలు జరుగుతున్నాయి ... ఘుమఘుమలాడే ఆహార పదార్థాలు వంటగదిలో సిద్ధమవుతున్నాయి. ఆ ఇంటికి పక్కనే ఉన్న పిల్లి ముక్కుపుటాలకు ఆ వాసన తగిలింది. మెల్లిగా గోడ దూకి ఆ గదిలోకి ప్రవేశించే ప్రయత్నం చేసింది. వెంటనే ఇంటి యజమాని చూసి కర్రతో కొట్టి, బయటకు పంపాడు. పిల్లి మనసు మారలేదు. మరోవైపు నుంచి గదిలోకి దూకేందుకు విఫలయత్నం చేసింది; మళ్ళీ దెబ్బలపాలైంది. చివరకు వేడుక పూర్తయ్యేదాకా వేచి ఉండి, ఆ పిల్లి రాత్రికి పునః ప్రయత్నం చేసింది. ఇంటి వారంతా వంటగదికి తాళం వేసి పక్కగదిలో పడుకున్నారు. పిల్లి కిటికీలో నుంచి గదిలోకి ప్రవేశించింది. పాత్రలో అడుగున మిగిలిన ఆహార పదార్థాన్ని తిని తల బయటకు తీయడానికి ప్రయత్నించింది. అది చిన్నపాత్ర కావడంతో పొరపాటున పిల్లి తల దాన్లో ఇరుక్కుపోయింది. భయం ఓ వైపు, బయటకు పోవాలన్న తపన మరోవైపుతో పిల్లి పరిస్థితి దయనీయంగా మారింది. తలను బయటకు తీసే ప్రయత్నంలో గదంతా పరుగులు తీసింది. ఈ అలికిడికి పక్కగదిలోని వారంతా లేచారు. పిల్లికి నాలుగు తగిలించి బయటకు పంపారు. అది ఉసూరుమంటూ మరో ఇంటి వంటగదివైపు పరుగెత్తింది. మనం కూడా మమకారాలనే మోజుతోనే మళ్ళీ మళ్ళీ ఈ లోకంలోకి ప్రవేశిస్తున్నాం; పశ్చాత్తాపమన్నా లేకుండా లోలకంలా అటూ ఇటూ ఊగులాడుతూ తిప్పలు పడుతున్నాం. అదే భావంతో ఆదిశంకరాచార్యుల ప్రత్యక్ష శిష్యులు నిత్యానంద 'భజ గోవిందం'లో ...

**పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనమ్।**
**ఇహ సంసారే బహు దుస్తారే కృపయాఽపారే పాహి మురారే॥**





'మళ్ళీ పుట్టడం, మరణించడం, తల్లి గర్భాన పడటం - ఇలాంటి దాట శక్యంకాని సంసారం నుంచి నీ అపారమైన దయతో ఓ మురారీ! నన్ను రక్షించు' అని వేడుకుంటున్నారు.

**ఎన్నాళ్ళీ రాకపోకలు ...**

ఈ జీవితాలు మనకు నిజంగా ఆనందాన్నే ఇస్తున్నాయా? అని ఒక్కసారి కళ్ళు మూసుకొని ఆలోచిస్తే, అసలు విషయం అర్థమైపోతుంది. ఎండిపోయిన చెరుకుగడ నుంచి రసాన్ని జుర్రుకోవాలనే వెర్రి ప్రయత్నాలు చేస్తున్న వెంగళప్పల్లా మనం మారిపోతున్నాం! వస్తువులనూ, విషయాలనూ అనుభవించేటప్పుడు ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకుంటూ ఉండాలి. నిజంగా వీటి వల్ల నేను సంపూర్ణమైన ఆనందాన్నే పొందుతున్నానా? అని అంతరంగంలో ప్రశ్నించుకుంటూ ఉండాలి. అలాంటి ప్రయత్నమేమీ చేయకపోవడం వల్లనే, వాటిపై విముఖత కలుగకపోవడం వల్లనే ఆ సుఖాల కోసం లక్షల జన్మలు ఎత్తాల్సి వస్తోంది. మళ్ళీ ప్రపంచంలోకి ప్రవేశిస్తూ, పడరాని కష్టాలు పడాల్సి వస్తోంది. ఈ దుస్థితిని చూసే ప్రహ్లాదుడు గురుకులంలో తన మిత్రులతో ....

**కంటిరే మనవారు ఘనులు గృహస్థులై విఫలులై కైకొన్న వెర్రితనము**
**భద్రార్థులై యుండి పాయరు, సంసార పద్ధతి నూరక పట్టువడిరి**
**కల యోనులందెల్ల గర్భాద్యవస్థల పురుషుండు దేహియై పుట్టుచుండు**
**తన్నెరుంగడు, కర్మతంత్రుడై కడపట ముట్టడు భవశతములకునయిన**

'మీరు చూస్తున్నారు కదా! మన వాళ్ళు గృహస్థ జీవితం గడుపుతూ పడుతున్న పాట్లు! ఆనందం కోరుకుంటారే కాని వెర్రితనం మాత్రం విడిచి పెట్టరు. సంసారం అనే ఊబిలో ఊరకే కూరుకుపోతుంటారు. రకరకాల స్త్రీల గర్భాలలో నుంచి నానా అవస్థలు పడి పుడుతూ ఉంటాడు మానవుడు. కానీ, తన గురించి తాను తెలుసుకోడు. వందల కొద్దీ జన్మ లెత్తినా కర్మబంధాల చిక్కుల్లో నుంచి బయటపడలేడు. విష్ణు సన్నిధిని

చేరుకోలేడని బాధపడుతూ హెచ్చరిస్తాడు.

**కోరికల వల్లే కోటి జన్మలు .... :** కోరికల కోటను బలంగా, భారీగా నిర్మించుకుంటున్నాం. చివరకు మనం నిర్మించుకున్న ఆ కోటకు ఆది ఏదో, అంతమేదో, బయటపడే మార్గమేదో మనమే తెలుసుకోలేనంత దైన్యానికి చేరిపోయాం. పరిమితమైన ఈ శరీరంతో, ఆయుష్షుతో ఆ కోరికలు తీరే ప్రసక్తే లేదు. అందుకే వాటిని తీర్చుకోవాలన్న తహతహతో అనేక జన్మలు ఎత్తుతున్నాం. యువకుడిగా ఉన్నప్పుడు ఒకసారి శ్రీరాముడు తమ గురుదేవులైన వశిష్ఠుడిని "మాంసం, ఎముకలు, చర్మంతో కూడిన ఈ శరీరం ఎవరి వలన నిర్మితమైంది? ఎక్కడ నుంచి వచ్చింది? దాని స్థితి ఏమిటి? దానిలో ఎవరు నివసిస్తారు?' అని ప్రశ్నించాడు. అప్పడు వశిష్ఠుడు ఇలా వివరించాడు :

**అస్థి స్థూణం నవ ద్వారం రక్త మాంసావలేపనమ్।**

**శరీరం సదనం రామ న కేన చిదిదం కృతమ్॥**

'ఓ రామా! ఎముకలు, రక్త మాంసాలతో కూడి తొమ్మిది రంధ్రాలున్న ఈ శరీరగృహాన్ని ఎవ్వరూ నిర్మించలేదు. వేలకొద్దీ జన్మలెత్తుతూ, 'ఈ మాంస, అస్థిమయ దేహమే నేను' అనే భ్రాంతి బాగా దృఢపడడం వల్ల మరల మరల అసంఖ్యాకులైన ఈ శరీరాలు ఏర్పడుతున్నాయి. ఇలా శరీరాలు మన కోరికల వల్లనే ఉత్పన్నాలవుతున్నాయి. ఎవరో బలవంతంగా తెచ్చిపెట్టినవి కావు.

మన స్వయంకృత కార్యకలాపాల వల్లనే మనకు శరీరాలు సంప్రాప్తిస్తు న్నాయి. చావు పుట్టుకల ప్రయాణ ప్రయాసల నుంచి బయటపడాలంటే ఈ లోకంలోని ఋణాల నుంచి విముక్తులం కావాలి. కోరికలనూ, కర్మలనూ అనుసరించే మన జన్మలు ఆధారపడి ఉంటాయని గుర్తు పెట్టుకోవాలి.

**కర్మ వదిలితేనే కైవల్యం .... :** ప్రపంచానికి సంబంధించిన పనులు





ముగించుకోనిదే ప్రశాంతతకూ, పరమాత్మకూ దగ్గర కాలేము. లౌకిక పరమైన లంపటాలను ఎంత త్వరగా వదిలించుకోగలిగితే, మనకు అంత త్వరగా ఉన్నతోన్నతమైన సుఖం లభిస్తుంది. అయితే మనలో చాలామంది కాటికి వెళ్ళేవరకూ ఏవో కార్యకలాపాల్లో మునిగి, ఆ భ్రమలతో, జనన మరణ చక్రంలో పడి నలిగిపోతూ ఉంటారు. సంసార దుఃఖసాగరంలో మునకలేస్తూ ఉంటారు. అందుకే నిత్యానంద **ఇహ సంసారే బహు దుస్తారే ...** అంటున్నారు. కానీ దురదృష్టకర విషయమేమంటే, నోరంతా రక్తమోడు తుందని తెలిసినా, ఒంటె ముళ్ళకంపలు తినడానికే ఇష్టపడినట్లు, మనిషి కూడా మరలా, మరలా ఆ దుఃఖపూరితమైన సంసారంలోకి ప్రవేశించ డానికి సిద్ధపడుతున్నాడు. ఆ మార్గంవైపే మళ్ళీ మళ్ళీ అడుగులు వేస్తు న్నాడు. పాపపుణ్యాలు మూటగట్టుకొని బహుదూరపు బాటసారిలా పయ నిస్తున్నాడు. ఈ చావుపుట్టుకల చరితను నిర్వచిస్తూ శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో (15.8)

**శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః।**

**గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్॥**

'పుష్పాలలోనూ, తదితర పరిమళ స్థానాలందూ ప్రవేశించి, సువా సనను గ్రహించి వాటి నుంచి వాయువు వెలువడునట్లు, జీవుడు తన శరీరమునందు ప్రవేశించినప్పడు గాని, ఒక దేహం నుంచి వెలువడు నప్పడు గాని అందులో నుంచి సంగ్రహించిన వాసనలతో అనగా మంచి చెడు సంస్కారాలతో నిర్గమిస్తాడు' అంటాడు. అదే సంస్కారాల ప్రభావంతో మరో జన్మనెత్తడం ఇక అనివార్యమవుతుంది. అటు, ఇటుగా ఏ దేహాన్ని ధరించినా, దానికి సంబంధించిన కష్టనష్టాలు మాత్రం తప్పకుండా భరించాల్సిందే! అందుకే అన్నీ తెలిసినవారు అసలు ఈ శరీరధారణే వద్దను కుంటారు.

**మురారే మనకు దిక్కు :** అయితే ఇన్ని లక్షల జన్మల సంస్కారం నుంచి

బయటపడే తోవను చూపేది మాత్రం ఆ భగవంతుడే! ఆయన ప్రమేయం లేకుండా ఆయన ఆడించే ఆట నుంచి మనం తప్పకునే ప్రసక్తే లేదు. రంగులరాట్నంలో భయమేస్తోందనీ, ఏడ్చి దింపమని రొద చేసే బిడ్డను తండ్రి ప్రేమతో ఆ చక్ర డోల నుండి కిందకు దించుతాడు. అదే విధంగా 'ఈ సంసార నాటకాన్ని నేనిక ఆడలేను తండ్రీ!' అని మనం ఆర్తితో ఆవేదన పడితే, ఆ దేవదేవుడే దయ తలచి మనకు ముక్తిని ప్రసాదిస్తాడు. అందుకే పాండురంగ శతక కర్త ఇలా అంటాడు :

**నీవు కరుణించినంగాని నిన్ను గాంచ**
**నలవి గాదయ్య బహుజన్మములకునైన**
**వేగ కృప తోడ బ్రోవుమో వేదవేద్య**
**పరమ కరుణాంతరంగ! శ్రీపాండురంగ!**

కానీ మనం లేనిపోని భేషజాలతో 'నేను', 'నా ప్రజ్ఞ', 'నా పరపతి' అని అహంకరిస్తూ ఆ పరమపతిని విస్మరిస్తున్నాం. మనసారా ఆ మాధవుడి ముందు కూర్చొని ప్రేమతో ప్రార్థించడానికి విముఖత చూపుతున్నాం. కానీ, ఈ కలియుగంలో భక్తిని మించిన మార్గం లేదు. వీలు కుదిరినప్పుడల్లా ఏకాంతంగా మనకు గురి కుదిరిన సాకారరూపంలో ఆ భగవానుణ్ణి స్మరించుకుంటూ, ఆయనను మించిన మంచి సన్నిహితుడు మరొకరు లేరని మరచిపోకుండా ఉంటే చాలు! మరో జన్మ లేకుండా చూస్తాడు; ఒకవేళ మన ప్రారబ్ధం ప్రకారం జన్మనిచ్చినా తను తోడుగా మన వెంట ఉండి రక్షించుకుంటూ ఉంటాడు. అందుకే 'భగవంతుడా! 'నువ్వే కర్తవు' అనే ఎరుక కలుగనంత వరకు మళ్ళీ మళ్ళీ జన్మనెత్తవలసిందే. 'నువ్వే కర్తవు' అన్న ఎరుక కలిగితే మరుజన్మ ఉండదు. ఆ ఎరుక కలుగనంత వరకు జనన మరణాలు కొనసాగుతూనే ఉంటాయి. ముక్తి లభించదు" అని అంటారు భగవాన్ రామకృష్ణ పరమహంస.





# మాతృసంస్థ కబుర్లు

మన ఇతిహాసాలలో శ్రీమహావిష్ణువు ఎనిమిదవ అవతారం శ్రీకృష్ణుడి జన్మదినం. దీనినే కృష్ణాష్టమి, గోకులాష్టమి అంటారు.

సాయిధామం ద్వారవతి సాయి దేవాలయంలో ఆగస్టు 30న కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వన్నెవన్నెల పుష్పాలతో మంటపాలంకరణ. కన్నయ్యకు ఇష్టమైన పాలు, వెన్న, మీగడ, పరమాన్నం, పులిహోర నివేదనలతో చక్కగా సంప్రదాయబద్ధంగా వేడుక జరిగింది. ఆశ్రమంలో వున్న చిన్నారులు చిన్ని కృష్ణులుగా, గోపికలుగా వేషాలు వేసి అందరినీ అలరించారు. పూజ్య శ్రీశ్రీశ్రీ శ్రీరామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో కృష్ణపూజ, అనంతరం కృష్ణ భగవానుని అవతార రహస్యమును వివరించారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ ... అన్న గీతోపదేశంతో మానవాళికి దిశానిర్దేశం చేశారు. కృష్ణుడి మహోన్నత వ్యక్తిత్వానికి ఆయన లీలలు అద్దం పడుతున్నాయి. ద్వాపర యుగంలో జన్మించిన కృష్ణుడు నేటి కలి యుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కృష్ణుని గుణగణాలను ప్రతి వ్యక్తీ కలిగి ఉండాలనీ స్వామీజీ ప్రవచించారు. సాయంత్రం భగవద్గీత పారాయణ జరిగినది.

సెప్టెంబర్ 3వ తేది ప్రభుజీ అనుష్ఠాన నిలయ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శ్రీశ్రీశ్రీ మాతా నిర్మలానంద యోగ భారతి గారు విచ్చేసారు. ముందురోజే సత్తెనపల్లి శాఖ నుంచి విచ్చేసిన శ్రీమతి శ్రీలక్ష్మి మరియు శ్రీ ప్రేమ్‌కుమార్‌గార్లు, అనుష్ఠాన మందిరానికి బంతిపూలతో ఎంతో అందంగా అలంకరణ చేసారు. ఉదయం గం.9.30 లకు గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, లక్ష్మీ గణపతి మాల మంత్ర హవచనము. గం.10.55 ని.లకు గురుసన్నిధి ద్వారపూజ, గురు సన్నిధి ప్రవేశం, గురు పాదుకా పూజ, శాంతి వేద పఠనం గం.11.45

ని.లకు శ్రీశ్రీశ్రీ మాతా నిర్మలానంద యోగ భారతి మాతాజీగారు మంగళాశీస్సులు అందించారు. అనంతరం శాంతి హోమం త్రిగుళ్ళ మాధవ శర్మ గార్ల ఆధ్వర్యంలో శ్రీమతి మీనాక్షి, శ్రీ శ్రీనివాస్ గార్లు, శ్రీమతి సాయిమాధురి మరియు శ్రీ గోపీకృష్ణ గార్లు యజ్ఞంలో దీక్షాధారులు అయినారు. ప్రతి మంత్రానికి అర్థాన్ని వివరిస్తూ చక్కగా జరిగింది. పూజ్య గురుదేవులు ఆశీర్వచనంతో కార్యక్రమం ముగిసింది. సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వినిమయం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఆర్థికంగా, హార్థికంగా సహకరించిన సాయి భక్తులకు భగవంతుని కరుణాకటాక్షములు ఎల్లవేళలా ఉండాలని సాయివాణి మనసారా ఆశీర్వదిస్తుంది. సెప్టెంబర్ 10, 2021 వినాయక చవితి. భారతీయులు అతి ముఖ్య పండుగలలో ఇది ఒకటి. భాద్రపద శుద్ధ చవితిని జరుపుకుంటారు. ఏ కార్యంలోనైన ప్రథమ పూజలందుకునే వినాయకుడంటే అందరికీ ఎంతో ఇష్టం.

సాయిధామం ఆశ్రమంలో వినాయక చవితి అంటే పిల్లలకు, పెద్దలకు చాలా ఉత్సాహం సంతోషం. ముందురోజు సాయంత్రమే 21 రకాల పత్రులను ఆశ్రమం అంతా తిరిగి సేకరించడం, ఎవరికి వారు మట్టి వినాయకులను తయారుచేసుకోవడం, పాలవల్లికి కట్టాల్సిన పండ్లని, కాయలను సమకూర్చుకోవడం, అలంకరణకు పూలదండలు గుచ్చడం అంతా హడావిడి.

వినాయక చవితి రోజున తెల్లవారుజామునే సాయినాథుల వారికి కాకడ హారతి, అభిషేకం, ప్రత్యేక పూజ, అనంతరం గం.10.30 కు ఎంతో సుందరంగా అలంకరించుకున్న మండపంలో విఘ్నేశ్వరుని శాస్త్రోక్త పూజ. పిల్లలందరూ ఎవరి ప్రతిమలను వారు పెట్టుకొని 21 రకాల పత్రులతో పూజ్య గురుదేవుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం జరిగింది. ఈ పత్రులన్నీ మనిషి ఆరోగ్యానికి ఏ విధంగా ఉపయోగపడతాయో వివరించారు. మన పెద్దలు ఈ పండుగకు ఆవిరి మీద వండిన పదార్థాలు తినాలని పెట్టారు.





ప్రతి దాని వెనకాల అర్థం పరమార్థం ఉండేలా పెట్టారు అని వివరించారు. వినాయకుని వ్రత కథను కళ్లకు కట్టినట్టుగా చెప్పారు స్వామీజీ.

సెప్టెంబర్ 24 శుక్రవారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో లక్ష యువ గళ గీతార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో సాధు సంతులతో ధర్మాచార్యుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాయిధామం ఆశ్రమం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు మరియు వివిధ మఠాధిపతులు, పీఠాధిపతులు హాజరై ప్రసంగించారు. నేటి యువతీ యువకులకు సంస్కార అమృతం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ఆత్మవిశ్వాసం నింపే భగవద్గీత వైభవాన్ని ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం చాలా ఉందన్నారు.

**శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమం-సత్తెనపల్లి శాఖ**

ఆగస్టు 30వ తేదీ శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ స్వామి పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగినవి. ఉదయం గం.10లకు బాబా మందిరంలో శ్రీ కృష్ణ స్వామి విగ్రహం ఏర్పాటు చేసి తులసి పూల మాలాలంకృతులైన స్వామి దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకృష్ణ స్వామి పాదాలు, వివిధ పూల అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అష్టోత్తర శత నామావళి పూజ కార్యక్రమంతో ఉదయం కార్యక్రమం ముగిసినది. సాయంత్రం గం.4.00లకు ఉట్టికొట్టే కార్యక్రమం కోలాహలంగా జరిగినది. కుర్రవాళ్ళు, పిల్లలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్టి కట్టిన వారికి పూజారిగారు బహుమతులు అందజేసారు. ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసినది.

సెప్టెంబర్ 10వ తేదీ ఆశ్రమంలో వినాయక చవితి సందర్భంగా మూడు అడుగుల మట్టి వినాయకుడిని ఏర్పాటు చేసి ఆశ్రమ కార్యక్రమాలు ఎటువంటి విఘ్నాలు కలుగకుండా జరగాలని ప్రార్థిస్తూ పూజారిగారు వరసిద్ధి వినాయకునికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. 15వ తేదీ వరసిద్ధి వినాయకునికి నిమజ్జనోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగినది.

# విన్నపము

ప్రియమైన ఆశ్రమ భక్తులకు, శ్రేయోభిలాషులకు

పూజ్య గురుదేవుల ఆశీస్సులు.

సాయిధామం సేవాశ్రమంలో పూజ్య గురుదేవులచే ప్రారంభించ బడిన అనేక సేవా కార్యక్రమాలు శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ నిర్వ హణలో నిర్వహింపబడుతున్న విషయం పాఠకులకు విదితమే.

అయితే కొంతమంది స్వార్థపరులు తమ స్వార్థ ప్రయోజనాల కోసమే ఈ సంస్థ పేరిట పైకము (డొనేషన్స్) వసూలు చేస్తున్నారని, వసూలు చేసిన పైకానికి రశీదులు కూడా ఇస్తున్నారని, మేము సంస్థకు చెందిన వారమేనని, మాకు ఆశ్రమంతో, స్వామీజీతో అనుబంధం ఉందని తెలియ జేస్తూ వసూలు చేసిన పైకానికి ఇచ్చిన రశీదులు ఆదాయపు పన్ను వారు తిరస్కరించారనీ, బాధిత భక్తులు తెలియ జేశారు. ఇలాంటి స్వార్థపూరిత మైన వారికి పైకం ఇవ్వవద్దని విన్నవిస్తూ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే

**అకౌంట్ పేరు - Sri Sai Seva Samithi Trust**

**అకౌంట్ నెంబరు - 62002652136**

**SBI Keesara Branch**

**IFSC Code - SBIN0020639**

పంపగలరనీ, మీరు పంపిన పైకమునకు 80జి రాయితీతో కూడిన రశీదు పొందగలరని విజ్ఞప్తి చేస్తూ, ఆశ్రమ సేవా కార్యక్రమాలకు మీ సహాయ సహకారాలను అందించాలని ఆశిస్తూ -

**మేనేజింగ్ ట్రస్టీ,**
**శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్,**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ఫోన్స్ : 9440413455, 9848133565**







# ఆశ్రమ భిక్ష పథకం

# అన్నదాన పథకం



శ్రీ సాయీ సేవా సమితి వారి ఆశ్రమం "సాయిధామం"లో అన్నదాన పథకం నడుస్తున్నది. అన్ని దానాల్లోకి అన్నదానం పుణ్యప్రదమని పెద్దలంటారు. శ్రీ సాయికి అన్నదానాలు చాలా ప్రీతిపాత్రం. ఆకలిగొన్న ఎవరికి అన్నం పెట్టినా అది నాకే చెందుతుందని బాబా కంఠోక్తిగా చెప్పారు. తను మాత్రమే వండుకొని తినడం పాపమని గీత చెప్పింది. అన్న దానాన్ని మించిన దానం లేదని అన్ని శాస్త్రాలు అంటున్నాయి. అందుచేత సాయీ భక్తులైన వారికి యీ పుణ్యప్రదమైన అవకాశం కల్పించటం కోసం ఈ పథకం రూపొందింపబడింది.

సభ్యత్వంగా రూ.6,116/-లు చెల్లించిన వారు యీ పథకంలో సభ్యు లవుతారు. సంవత్సరానికొకసారి చొప్పన వారి పేరిట (వారు కోరిన తేదీన గోత్ర నామాలతో) శ్రీ సాయి అర్చన జరుగుతుంది. అదేరోజు వారి పేరిట ఆశ్రమంలో "భిక్ష" ఏర్పాటు చేయబడుతుంది. దీంట్లో వారు స్వయంగా కూడా పాల్గొనవచ్చు. ఆ రోజు వారిపేరు భోజనశాలలో బోర్డు మీద వ్రాయటం ద్వారా ప్రకటితమవుతుంది. సభ్యత్వపు రుసుము **"శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు"** పేరిట చెక్కుల ద్వారాగానీ, ఆన్‌లైన్ ద్వారా గానీ పంపవచ్చు. ఈ పథకంలో చేరేవారు తమ చిరునామా, ఎవరి పేరుమీద జరగాలో వారి వివరాలు, చిరునామా, మొబైల్ ఫోన్ నెంబర్లు కూడా వ్రాసి పంపాలి.

సాయి బంధువులారా,

మీ పిల్లల జన్మదినాల పేరిటో, మీ వివాహ వార్షికోత్సవాల పేరిటో, గతించిపోయిన పెద్దల పేరిటో, మీ గురుదేవుల పేరిటో యీ పథకంలో మీరు భాగస్వాములు కండి. మీకు తెలిసిన వారికి కూడా యీ విషయం తెలియ జేయండి. ఆకొన్నవారి కడుపునింపి శ్రీ సాయినాథుల అపార కరుణకు పాత్రులు కండి. చిరునామా సాయివాణిదే.

**- ధర్మాధికారి, సాయిధామం,**
**శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్,**
**రామలింగంపల్లి పోస్టు, యాదాద్రి భువనగిరి జిల్లా-508126**

# ధర్మాచరణకు వయస్సు

శ్రీ గురుమూర్తి తల్లి ఆయనతో ఇలా అన్నది : "నాయనా! మన సంప్రదాయం ప్రకారం బ్రహ్మ చర్యాశ్రమ కాలంలో విద్యాభ్యాసం తర్వాత గృహస్థాశ్రమ స్వీకారం చేయాలి. యజ్ఞయాగాదులు తదితర కర్మలతో గృహస్థ ధర్మాలను చక్కగా అనుష్ఠించాలి. అటుపైన కదా సన్యాసము. తన లోపలి వాసనలు తీర్చుకొన్న తర్వాతనే తపస్సుకు వెళ్ళాలి.

అందుకు శ్రీపాద శ్రీవల్లభులు ఇలా అన్నారు - "అమ్మా! మీరిలా అంటున్నారు సరే. లోకంలో ఎవరైనా స్థిరంగా చిరకాలం జీవించేటట్లయితే మీరు చెప్పిన క్రమంలో ఒకదాని తర్వాత ఒక ఆశ్రమాన్ని స్వీకరించవచ్చు. కానీ, ఈ తనువు ఎప్పుడు నశిస్తుందో తెలియదు కదా! మృత్యువును జయించిన వారికి మాత్రమే శరీరము నిత్యం. నీవు చెప్పిన రీతిలో నడవడం వారికే కుదురుతుంది. కానీ, రేయింబవళ్లు గడిచిపోతూ ఉంటూ ఆయువు కూడా క్షణక్షణం తగ్గిపోతూ ఉంటుంది. సూర్యరథం కనురెప్ప దూరంలో ఎనభై ఎనిమిది వేల యోజనాలు ఎలా పరుగెడుతుందో, మన ఆయువు కూడా అలాగే మృత్యువువైపు పరుగులు తీస్తూ ఉంటుంది. పండుటాకులు చెట్టుకు అంటుకొని ఉన్నట్టే కనిపిస్తాయి. కానీ, ఎప్పుడు రాలిపోతాయో తెలియదు. మన శరీరాలు కూడా అంతే. అమ్మా! శరీరానికి ఎప్పుడూ సహవాసిగా ఉండేది ఒక్కరే. అది మృత్యువు. మరణం యవ్వనంలో వస్తుందా, వృద్ధాప్యంలో వస్తుందా అన్న దానికి సమాధానం లేదు. అందుకని అవకాశం చిక్కినప్పడే ధర్మాచరణ ప్రారంభించాలి. అమ్మా! ఎవరికైనా వడ్డీకి అప్పు ఇచ్చామనుకో. వాడు తిరిగి ఇచ్చే రోజు ఎప్పుడన్నది మన స్మృతిలో ఉండనే ఉంటుంది, కదా! అలాగే ఈ ప్రాణాన్ని మనకు





ఇచ్చి పంపిన భగవంతుడు, తిరిగి తీసుకొనే కాలాన్ని కూడా లెక్క పెడుతూనే ఉంటాడు కదా! నదులన్నీ తమ నీళ్లను సముద్రం లోపలికి తీసుకు వెళ్లి కలిసిపోతాయే తప్ప వెనక్కు తిరిగి తమ జన్మభూమికి రావు. అలాగే ఆయుష్షు కూడా తిరిగి రాదు.

ఏ రోజు పుణ్యం సంపాదించుకోకుండా గడిచిందో ఆ రోజు వ్యర్థం అయినట్లే. మనం పుణ్యం చేద్దామని అనుకునేంత వరకు యముడు మనలను ఉంచుతాడా? అమ్మా! భార్యా బిడ్డలు, ధనము, గోవులు, ఆయువు, శరీరం యివన్నీ అశాశ్వతాలే. వీటిని శాశ్వతాలుగా భావించే మనిషి పశువు కంటే హీనుడు. పుణ్యాచరణ విషయంలో అలసత్వం చూపించేవాడు తన నరకం తాను కొని తెచ్చుకుంటున్నట్లే. శాశ్వతత్వాన్ని పొందాలనే సంకల్పం కలిగిన వారు మిగిలిన పనులన్నీ విడిచి పెట్టుకోదగునా! అందుచేత వివేకులైన వారు తమ తమ యౌవన సమయాల్లోనే ధర్మాచరణ చేయాలి. నీవు తల్లివి. నాకు సన్యాసానికి సెలవివ్వు" అన్నారు.

అటుపై శ్రీ గురుదేవులు సన్యాసదీక్ష స్వీకరించారు.

**ఇతరుల మీద కోపతాపాలు ప్రకటించి**
**కఠినంగా మాట్లాడవద్దు. ఎవరి తోనూ కలహం వద్దు.**
**ఇతరులు నిన్ను నిందిస్తే ఓర్పుతో శాంతి వచనాలు పలుకు.**
**ఇదే సుఖప్రాప్తికి మార్గం. ప్రపంచం తలక్రిందులైనా సరే**
**ముక్కుకు సూటిగా నీ మార్గంలోనే నీవు నడుస్తూ ఉండు.**
**– బాబా**